News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK చంద్రకాంత్ NEWS
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 04 | సంచిక :306 | ఖమ్మం | బుధవారం డిసెంబర్ 17, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# పల్లె పోరు.. నేటితో ఆఖరు

మూడో దశ పోలింగ్ నేడే

3,752 సర్పంచి, 28,410 వార్డు సభ్యుల పదవులకు పోటీ



తెలంగాణలో గ్రామ పంచాయతీల ఎన్నికల సమరం బుధవారంతో ముగియనుంది. ఇప్పటికే తొలి, మలి దశ ఎన్నికలు జరగగా... బుధవారం మూడో దశ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమయింది. మొత్తం 26,01,861 మంది పురుషులు, 27,04,394 మంది స్త్రీలు, 140 మంది ఇతరులతో కలిపి మొత్తం 53,06,395 మంది 36,452 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 43,856 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు.

## పటిష్ఠ బందోబస్తు

తుది దశ ఎన్నికలు కావడంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. పోటాపోటీగా అన్ని పార్టీలు తమ మద్దతుదారుల కోసం స్థానికంగా ప్రచారం నిర్వహించాయి. మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా భారీఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పలు చోట్ల అదనపు బలగాలను మోహరించారు.

వివరాలు 2లో..



# ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించండి

## రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన.. కేంద్రమంత్రులతో వరుస భేటీ

కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసిన సీఎం

విద్యాభివృద్ధి కోసం రూ.30 వేల కోట్ల రుణంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

రాష్ట్రానికి ఐఐఎం ఇవ్వాలని ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి?

విజన్ డాక్యుమెంట్‌ను అందజేసిన ముఖ్యమంత్రి

యంగ్ ఇండియా స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని విజ్ఞప్తి

వివరాలు 2లో..

### ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి



- సోనియా గాంధీతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి
- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ సమర్పణ
- రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చ
- రేవంత్ రెడ్డి దార్శనికతను అభినందించిన సోనియా
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం




## ఐబొమ్మ రవికి మరో 12 రోజుల పాటు పోలీసు కస్టడీ

మూడు కేసుల్లో 4 రోజుల చొప్పున విచారణ చేయాలన్న కోర్టు

ఈ నెల 18 నుంచి రవిని కస్టడీకి తీసుకోనున్న సైబర్ క్రైమ్ పోలీసులు

రవిని మరోసారి కస్టడీకి తీసుకుంటేనే నెట్ వర్క్ బయటపడుతుందన్న పోలీసులు

వివరాలు 2లో..



## ఆస్ట్రేలియా ఉగ్రవాదిది హైదరాబాదే

టోలిచౌకి నుంచి వలస వెళ్లిన సాజిద్

27 ఏళ్లుగా భారతీయ పాస్‌పోర్టుతోనే..

ఫిలిప్పీన్స్‌లో ఐసిస్ శిక్షణ!

కుమారుడితో కలిసి దాడి.. ఎదురుకాల్పుల్లో సాజిద్ మృతి

ఐసిస్ ప్రేరేపిత దాడిగా అనుమానం.. 15 మంది మృతి

వివరాలు 2లో..

## మా ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు



రెండు విడతల పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయన్న మంత్రి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందన్న సీతక్క

పూర్తిస్థాయి నిధులు గ్రామాలకు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు వెల్లడి

మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇలాంటి వాటిని తాము సహించేది లేదని స్పష్టం చేశారు. ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు .తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటి వరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతం గా పూర్తయ్యాయని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని ఆమె అన్నారు. గ్రామాలకు పూర్తిస్థాయి

వివరాలు 2లో..

# లీక్ వీరులకు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..

## మోదీ మీటింగ్‌పై కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ బీజేపీలో కలకలం రేపిన లీకుల వ్యవహారం
- ఎంపీలకు ప్రధాని మోదీ క్లాస్ తీసుకున్నారంటూ ప్రచారం
- లీకుల వార్తలను తీవ్రంగా ఖండించిన కిషన్ రెడ్డి
- లీక్ వీరులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



తెలంగాణ బీజేపీలో లీకుల వ్యవహారంపై కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ బీజేపీ ఎంపీలతో జరిపిన అంతర్గత సమావేశ వివరాలు మీడియాకు లీక్ కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ఎంపీలకు క్లాస్ తీసుకున్నారంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, అది కేవలం తప్పుడు ప్రచారం మాత్రమేనని కొట్టిపారేశారు. గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ఎంపీలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ భేటీలో రాష్ట్ర పార్టీ పనితీరుపై ప్రధాని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని, ప్రతిపక్ష పాత్ర పోషించడంలో విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో

వివరాలు 2లో..

# యూరియా బ్లాక్ మార్కెట్‌కు చెక్.. కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్



ఇకపై యాప్‌లోనే యూరియా

యూరియా పక్కదారి పట్టకుండా సర్కార్ కొత్త ప్లాన్

పంటల సర్వేకు జర్మనీ కంపెనీతో తుది దశలో చర్చలు

రాష్ట్రంలో యూరియా కొనుగోళ్ల కోసం త్వరలోనే ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. యూరియా అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు, పరిశ్రమలకు తరలిపోకుండా నేరుగా రైతులకే అందేలా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో

వివరాలు 2లో..



# జీ రామ్ జీపై..గరంగరం

కొత్త బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

గాంధీ పేరు మార్పును తప్పుబట్టిన కాంగ్రెస్

రామూడి నామాన్ని అపవిత్రం చేయొద్దు: విపక్షం

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా)ను రద్దుచేసి దాని బదులు 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-(గ్రామీణ్' (వీబీ- జీ రామ్-జీ)ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. సభా కార్యకలాపాల జాబితాలో ఈ అంశాన్ని చేర్చినప్పుడు సోమవారమే అభ్యంతరం తెలిపిన విపక్షాలు వరసగా రెండోరోజు పెద్దఎత్తున విరుచుకుపడ్డాయి. ముందుగా జాతిపిత పేరును తొలగించి, తర్వాత మొత్తం పథకానికే మంగళం పాడేస్తారేమోనని

వివరాలు 2లో..



# మృత్యుపాశమైన పొగమంచు

ఉత్తర్‌ప్రదేశ్‌లో 5 ఘోర రోడ్డుప్రమాదాలు

25 మంది మృత్యువాత..59 మందికి గాయాలు

మథుర: ఉత్తర్‌ప్రదేశ్‌లో దట్టమైన పొగమంచు 25 నిండు ప్రాణాలను బలితీసుకుంది. పొగమంచు

వివరాలు 2లో..

# ఎఫ్‌ఆర్‌బీఎం నుంచి మినహాయించండి

రాష్ట్రంలో 105 నియోజకవర్గాల్లో నిర్మించబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం తెలంగాణ ప్రభుత్వం సమీకరించబోయే రూ.30 వేల కోట్ల రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. దేశ ప్రధాన వ్యాపార, వాణిజ్య కేంద్రంగా మారిన హైదరాబాద్‌కు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. తొలుత మంగళవారం ఉదయం దిల్లీలోని 10–జన్‌పథ్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో సమావేశమై ఇటీవల జరిగిన తెలంగాణ గ్లోబల్ సమిట్ గురించి తెలియజేశారు. ఆ సందర్భంగా విడుదల చేసిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను అందజేశారు. అనంతరం పార్లమెంటు భవన్‌లో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసి విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. "తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించ తలపెట్టాం. 5 నుంచి 12 తరగతుల వరకు ఉండే ఈ స్కూళ్లలో ఒక్కోదాంట్లో 2,560 మంది చదువుకోనున్నారు. ఇవి సమీప ప్రభుత్వ పాఠశాలలకు విద్యా హబ్‌లుగా మారనుండడంతో పరోక్షంగా లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. అత్యాధునిక వసతులు, ప్రయోగశాలలు, స్టేడియాలతో నిర్మించే ఈ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా. అలాగే రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వ్యయం కానుంది. మొత్తంగా రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చుచేయనుంది. ఈ నిధుల సమీకరణకు ఎస్‌పీవీ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దాని ద్వారా సేకరించే రుణాలకు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించండి. విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధికి చేస్తున్న పెట్టుబడిగా భావించి ఈ మినహాయింపును అమలుచేయండి" అని రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను అందజేశారు.

**9 కేంద్రీయ, 16 జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయండి**

తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు. "కుమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు.. హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలి. వీటికి అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్‌రెడ్డి.. ధర్మేంద్ర ప్రధాన్‌కు వివరించారు. తెలంగాణలో విద్యా రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపుతున్న చొరవను నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించినట్లు తెలిసింది. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి వెంట ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి ఉన్నారు.

**ఐఐఎం కోసం 200 ఎకరాల భూమిని గుర్తించాం**

"టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా 21 ఐఐఎంలు ఉన్నాయి. అన్ని అర్హతలున్న తెలంగాణలోనూ దీన్ని ఏర్పాటు చేయాలి. ఇందుకోసం 200 ఎకరాల భూమిని హెచ్‌సీయూ ప్రాంగణంలో గుర్తించాం. తరగతులు ప్రారంభించేందుకు తాత్కాలిక క్యాంపస్ సిద్ధంగా ఉంది. ఐఐఎం ఏర్పాటు చేస్తే తెలంగాణలోని పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు విద్యావకాశాలు మరింత మెరుగవుతాయి" అని సీఎం రేవంత్.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వివరించారు.

# ఢిల్లీలో సోనియాను కలిసి విజన్ డాక్యుమెంట్ అందించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేసి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి సోనియా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. ఇటీవల డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025' వివరాలను కూడా ఆమెకు తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి
దార్శనికతను సోనియా గాంధీ అభినందించారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ, ముఖ్యమంత్రికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఏమిటీ విజన్ డాక్యుమెంట్?**

'తెలంగాణ రైజింగ్–2047' విజన్ డాక్యుమెంట్ ప్రకారం, రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకోవాలని నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు
రాష్ట్రాన్ని క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) అనే మూడు ప్రత్యేక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు.

ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం పంపుతూ, తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఈ సదస్సు ఒక పెద్ద ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# ఆస్ట్రేలియా ఉగ్రవాదిది హైదరాబాదే

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో తీవ్ర కలకలం రేపిన బాండీ బీచ్ ఉగ్రదాడికి హైదరాబాద్‌తో సంబంధాలున్నట్లు తేలింది. ఈ దాడిలో ప్రధాన నిందితుడైన సాజిద్ అక్రమ్ (50) హైదరాబాద్‌కు చెందినవాడేనని తెలంగాణ డీజీపీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. దాదాపు 27 ఏళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన సాజిద్, అక్కడ ఉగ్రవాదిగా మారి ఈ ఘాతుకానికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది.ఇటీవల సిడ్నీలోని ప్రఖ్యాత బాండీ బీచ్‌లో యూదులు హనుక్కా ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ అక్రమ్ (24) విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 15 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో సాజిద్ అక్రమ్ హతమవగా, అతని కుమారుడు నవీద్‌ను అధికారులు అరెస్టు చేశారు. ఇది ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ప్రేరేపిత దాడి అని ఆస్ట్రేలియా అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌లో బీకామ్ పూర్తి చేశాడు. సుమారు 27 ఏళ్ల క్రితం, 1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడే యూరప్‌కు చెందిన వెనెరా గ్రోసో అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు నవీద్, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఆస్ట్రేలియా పౌరసత్వం కలిగి ఉన్నారు. ఆస్ట్రేలియాకు వలస వెళ్లినప్పటికీ, సాజిద్ ఇప్పటికీ హైదరాబాద్ నుంచి జారీ చేసిన భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నట్లు గుర్తించారు.ఆస్ట్రేలియా వెళ్లిన తర్వాత కుటుంబ, ఆస్తి వ్యవహారాల నిమిత్తం సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. అయితే, హైదరాబాద్‌లో

అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదని స్పష్టం చేసింది. అతని కుటుంబ సభ్యులు కూడా సాజిద్‌కు ఉగ్రవాద సంస్థలతో ఎటువంటి సంబంధాలు లేవని చెబుతున్నారు. ఈ ఘటనను ఆస్ట్రేలియా ప్రభుత్వం యూదు వ్యతిరేక ఉగ్రవాద చర్యగా పరిగణిస్తోంది. అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల సహకారంతో ఈ దాడి వెనుక ఉన్న పూర్తి వివరాలను రాబట్టేందుకు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో చదువుకున్న వ్యక్తి ఇలా అంతర్జాతీయ ఉగ్రవాదిగా మారడంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# జీ రామ్ జీపై..గరంగరం

- మొదటి పేజి తరువాయి

అనుమానం వ్యక్తంచేశాయి. కొత్తబిల్లులో రాముడి పేరు ధ్వనిస్తుండటంతో శ్రీరాముడిని అపవిత్రం చేయవద్దంటూ మరికొందరు సభ్యులు గట్టిగా గళమెత్తారు. సమగ్ర పరిశీలన కోసం బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. గాంధీ సిద్ధాంతాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ప్రభుత్వం స్పష్టంచేసినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. వాటి ఆరోపణలను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తిప్పికొట్టారు. బిల్లును ప్రవేశపెడుతూ– మహాత్మాగాంధీ అంటే తమకెంతో గౌరవమని, ఆయన సిద్ధాంతాలను తమ ప్రభుత్వం నమ్మడంతోపాటు ఆచరించి చూపిస్తోందని తెలిపారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే బిల్లు తీసుకొచ్చినట్లు స్పష్టంచేశారు.

**గాంధీ అందరి కుటుంబ సభ్యుడు: ప్రియాంక**

బిల్లుపై వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతుండగా అధికార పక్షంలో కొందరు.. 'ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ– "మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు. దేశంలో అందరి కుటుంబాల్లోనూ ఆయన సభ్యుడు. యావద్దేశం అలాగే భావిస్తుంది" అని తిప్పికొట్టారు. 'మహాత్మాగాంధీ మన జాతిపిత. పేరును మార్చడం ఆయనను అగౌరవపరచడమే అవుతుంది. పేరు మార్చే సాకుతో ఇప్పుడు పథకాన్ని రద్దు చేసేలా ఉన్నారు' అని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. గాంధీ పేరును తొలగించడం అనైతికమన్నారు. రాముడి పేరును అపవిత్రం చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

**వాకౌట్.. నిరసన ప్రదర్శన**

విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. గాంధీజీ చిత్రపటాలు ప్రదర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. పథకం పేరు మార్చడం మహాత్మాగాంధీకి అవమానమని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడమే బిల్లు ఉద్దేశమని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి మరింతగా ఊతం లభిస్తుందని పేర్కొంది.

**బీమాలో ఇక 100% ఎఫ్‌డీఐ**

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐని) ఇప్పుడున్న 74% నుంచి 100 శాతానికి పెంచడానికి ఉద్దేశించిన 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు'ను విపక్షాల నిరసనల మధ్య లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దీనిని ప్రవేశపెడుతూ– పోటీ పెరిగితే బీమా రేట్లు మెరుగ్గా ఉంటాయన్నారు. బీమాయేతర కంపెనీని బీమా కంపెనీలో విలీనం చేయడానికి వీలుకల్పించే నిబంధన కూడా బిల్లులో ఉంది. పాలసీదారుల పరిరక్షణకు నిధిని ఏర్పాటుచేస్తారు. ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుపై బిల్లును పార్లమెంటరీ సంయుక్త కమిటీకి పంపించాలని లోక్‌సభ నిర్ణయించింది. కాలంచెల్లిన 71 చట్టాల రద్దుకు ఆమోదం తెలిపింది.

# మృత్యుపాశమైన పొగమంచు

- మొదటి పేజి తరువాయి

కారణంగా రహదారులు సరిగా కనిపించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన ఐదు రోడ్డుప్రమాదాల్లో వీరంతా మరణించారు. ఈ దుర్ఘటనల్లో మొత్తంగా మరో 59 మంది గాయపడ్డారు. మథురలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై మంగళవారం తెల్లవారుజామున ఎనిమిది బస్సులు, మూడు చిన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టుకోవడంతో మంటలు చెలరేగాయి. ఈ ఒక్క ఘటనలోనే 13 మంది మృత్యువాతపడ్డారు. మరో 43 మంది గాయపడ్డారు. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు, క్షతగాత్రుల హాహాకారాలు, నుజ్జునుజ్జయి కాలిపోయిన వాహనాలతో ఘటనాస్థలంలో పరిస్థితి భీతావాహంగా కనిపించింది. బల్‌దేవ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మథుర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్లోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం– ప్రమాద సమయంలో.. ఒక మీటరు దూరంలో ఉన్న వాహనాలు కూడా సరిగా కనిపించలేనంత దట్టంగా పొగమంచు కమ్మేసి ఉంది. 13 మందీ కాలిన గాయాల వల్లే ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకూ ముగ్గురు మృతుల వివరాలను మాత్రమే గుర్తించారు. పలు మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. క్షతగాత్రుల్లో 33 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో తొలుత ఓ వాహనం, బస్సు ఢీకొన్నాయి. అనంతరం వాటిని కొన్ని బస్సులు ఢీకొట్టాయి. వాటిలో నుంచి కిందకు దిగిన ప్రయాణికుల మీదకు దూసుకెళ్లకుండా తప్పించే ప్రయత్నంలో మరిన్ని వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి.

ఇద్దరు పిల్లల్ని బయటకు తోసి..

మథురలో ప్రమాదానికి గురైన ఓ బస్సులో ఉన్న పార్వతి (42) అనే మహిళ.. తన ఇద్దరు పిల్లల్ని పగిలిన కిటికీలో నుంచి కిందకు తోసి వారి ప్రాణాలను రక్షించింది. ఈ క్రమంలో మెడలో అద్దం గుచ్చుకొని.. ఆమెకు తీవ్రంగా రక్తస్రావమైంది. ప్రస్తుతం పార్వతి ఎక్కడుందో తెలియరాలేదని బంధువులు వాపోతున్నారు.

**బస్తీ, ఉన్నావ్‌ల్లో నలుగురు చొప్పున..**

దట్టమైన పొగమంచు కారణంగా– బస్తీ జిల్లాలో ఓ బస్సు, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నావ్ జిల్లాలో ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో నలుగురు మరణించారు. బారాబంకీలో ఇద్దరు, మేరఠ్‌లో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు.

**రాష్ట్రపతి దిగ్భ్రాంతి**

యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదంలో 13 మంది మృతిచెందడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మథురలో ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# ఐబొమ్మ రవికి మరో 12 రోజుల పాటు పోలీసు కస్టడీ

పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవిని మరోసారి పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి డిస్ట్రిక్ట్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరో మూడు కేసుల్లో నాలుగు రోజుల చొప్పున 12 రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. ఎల్లుండి నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు అతనిని కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.మరో మూడు కేసుల్లో ఐబొమ్మ రవిని విచారించాలని సైబర్ క్రైమ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఒక్కో కేసులో నాలుగు రోజుల చొప్పున విచారించాలని కోర్టు ఆదేశించింది.ఈరోజు జరిగిన విచారణలో రవి తరఫు న్యాయవాది శ్రీనాథ్ కోర్టులో వాదనలు వినిపించారు. రవిని కస్టడీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు కస్టడీకి తీసుకున్నారని తెలిపారు. మరోవైపు, రవిని కస్టడీకి తీసుకుని విచారిస్తేనే పూర్తి నెట్ వర్క్ బయటపడుతుందని సైబర్ క్రైమ్ పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# మా ఆదివాసీ దేవుళ్ల జోలికొస్తే ఊరుకునేది లేదు

- మొదటి పేజి తరువాయి

నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదని బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో కొన్ని వేల ఇళ్లను ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారిందని విమర్శించారు. కొంతమంది నీచమైన రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లీక్ వీరులకు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..

- మొదటి పేజి తరువాయి

ఒవైసీ పార్టీ కన్నా వెనుకబడ్డారని ప్రధాని అన్నట్లు వార్తలు రావడం పార్టీలో కలకలం రేపింది.ఈ ప్రచారంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ.. అవన్నీ నిరాధారమైన కథనాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎలాంటి క్లాస్ తీసుకోలేదని, కేవలం పార్టీ బలోపేతానికి, సోషల్ మీడియాలో చురుగ్గా ఉండటానికి కొన్ని సలహాలు, సూచనలు మాత్రమే ఇచ్చారని స్పష్టం చేశారు. అంతర్గత సమావేశంలోని విషయాలను బయటకు లీక్ చేయడం కచ్చితంగా తప్పేనని అన్నారు. ఈ లీక్‌ల వెనుక ఉన్న 'లీకు వీరులు' ఎవరో తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనతో తెలంగాణ కమలంలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయని, ఆ లీడర్లు ఎవరనే దానిపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

# యూరియా బ్లాక్ మార్కెట్‌కు చెక్.. కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్

- మొదటి పేజి తరువాయి

ఆయన ఈ కీలక విషయాలను పంచుకున్నారు.

పత్తి అమ్మకాల కోసం ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్' యాప్ వంద శాతం విజయవంతమైందని, అదే స్ఫూర్తితో యూరియా యాప్‌ను రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ యాప్‌పై రైతు వేదికల ద్వారా రైతుల అభిప్రాయాలు సేకరించామని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అన్నారు. స్లాట్ బుకింగ్ వంటి విషయాల్లో రైతులకు సహాయం అందించేందుకు రైతు వేదికల వద్ద ఏఈవోలు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. కొందరు కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అదే సమయంలో, పంటల సర్వే కోసం శాటిలైట్ టెక్నాలజీని వినియోగించేందుకు జర్మనీకి చెందిన ఒక సంస్థతో చర్చలు తుది దశలో ఉన్నాయని తుమ్మల తెలిపారు. ఈ ఒప్పందం ఖరారైతే, వాస్తవంగా పంట సాగు చేసిన భూమికే 'రైతు భరోసా' సహాయం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. కొండలు, గుట్టల వంటి సాగు చేయని భూములకు భరోసా నిలిపివేసి, ఆ నిధులను ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు మళ్లిస్తే రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై త్వరలో కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

## పల్లె పోరు.. నేటితో ఆఖరు

- మొదటి పేజి తరువాయి

మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా... అందులో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు జీపీలలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 3,752 సర్పంచి పదవులకు 12,652 మంది పోటీ చేస్తున్నారు

36,452 వార్డుల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కాగా 116కి నామినేషన్లు దాఖలు కాలేదు. 7,908 ఏకగ్రీవమయ్యాయి. 18 వార్డులలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 28,410 వార్డులకు 75,725 మంది బరిలో ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో 4,502 మంది రిటర్నింగ్ అధికారులు, 77,618 మంది పోలింగ్ సిబ్బంది పాల్గొననున్నారు. 2,489 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు.

పోలింగ్ నేపథ్యంలో పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. 36,165 మందిని బైండోవర్ చేశారు. నగదు, ఆభరణాలు, మద్యం ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.2.09 కోట్ల నగదు, రూ.3.81 కోట్ల మద్యం, 2.28 కోట్ల మత్తుపదార్థాలు, రూ.12.20 లక్షల ఆభరణాలు, రూ.78.33 లక్షల ఇతర సామగ్రి ఉన్నాయి.

**సిబ్బంది సన్నద్ధం..**

మూడో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం నుంచే పోలింగ్ సిబ్బంది ఆయా మండలాల నుంచి ఎన్నికల సామగ్రి తీసుకుని.. తమకు కేటాయించిన గ్రామాలకు పయనమయ్యారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది వీరు..

## సిర్గాపూర్ లో కాంగ్రెస్ పార్టీ ని బలపరిచిన అభ్యర్థి శ్రీనివాస్ రావు అని గర్వం తో చెప్పిన నాగేష్ షెట్కార్



డిసెంబర్ (16) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎన్నికల్లో భగంగా స్వయంగా సిర్గాపూర్ మండల కేంద్రానికి సోమవారం నాగేష్ షెట్కార్ హాజరై మాట్లాడుతూ సిర్గాపూర్ లో ఇప్పటి వరకు నాలుగు సర్లు కాంగ్రెస్ తరపున సర్పంచ్ గా శ్రీనివాసరావు పోటీ చేశారు. ప్రజాలందరు కలిసి శ్రీనివాస రావు ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరరు

## వేములకొండ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం కు శుభాకాంక్షలు తెలిపిన మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎస్.కె రసూల్.

సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు డిసెంబరు 16.
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని వేములకొండ గ్రామంలో గ్రామ సర్పంచి ఏర్పుల వెంకటేశంను సాధారణంగా కలిసి శాలువాతో సన్మానం చేసిన వలిగొండ మండలం మాజీ కోఆప్షన్ నెంబర్ ఎస్కే రసూల్.
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు ఇబ్రహీం పాల్గొన్నారు

## బోదులబండ సర్పంచ్ విజయం.. పాలేరు గర్వకారణం : దయాకర్ రెడ్డి




సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం : నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన కట్టెకోల నాగార్జున మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి నాగార్జునను శాలువాతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించారు.
ఇప్పటివరకు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా 1505 ఓట్ల మెజారిటీ సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో నాగార్జున నిరూపించారని దయాకర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఘన విజయం పాలేరు నియోజకవర్గానికి, ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి గర్వకారణమని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవలో నాగార్జున ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొడాలి గోవింద్ రావు, మీసా నాగేశ్వరరావు, మీసా ముత్తయ్య, పొట్టపింజర రవి, ఎస్.కె. ఖాజామియా, అహ్మద్, అనంతు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటన

- కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన ప్రజాప్రతినిధులను కలవనున్న మంత్రి



సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం (రేపు) పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.
ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.
అదేవిధంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు కూడా మంత్రి అందుబాటులో ఉంటారని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు.

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.
- ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.
- ఎస్పీ రోహిత్ రాజు




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్), డిసెంబర్ 16,జిల్లాలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రోహిత్ రాజు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మూడో విడుతలో సమస్యాత్మక,సెన్సిటివ్,హైపర్ సెన్సిటివ్,క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలింగ్ సమయంలో ఎవరైనా ఎన్నికల ప్రక్రియకు,శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, గొడవలు, సృష్టించినా ఎట్టి పరిస్థితుల్లో వారిని వదిలే ప్రసక్తే లేదని,వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. జిల్లా ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించకోవాలని ఎస్పీ సూచించారు.ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు.
ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఊరేగింపులకు,ర్యాలీలకు అనుమతి లేదని బాణాసంచా కాల్చడం,డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలియజేశారు.
మూడో విడుతలో మొత్తం 249 పోలింగ్ స్థానాలలోని 1288 పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.సుమారుగా 1500 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.1288 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు-619, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు-134,అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు-168,క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు- 184, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు-183 లను గుర్తించినట్లు తెలిపారు.

## కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి అందుబాటులోకి తీసుకొని రావాలి...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- జనవరి నాటికి ధంసలాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- ధంసలాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే, ఆర్ఓబీ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, డిసెంబర్-17:కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావాలని, రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్ఓబీ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
మంగళవారం ధంసలాపురం వద్ద ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఖమ్మంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. నమూనా మ్యాప్ లను చూసి ఏజెన్సీలకు సూచనలు చేశారు. నిర్మాణ దశలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసురావాలని, పనులను వేగవంతం చేసి జనవరి కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ధంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, మున్నేరుపై బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అన్నారు.
ఖమ్మం ప్రజలకు, ప్రక్క రాష్ట్రం వారికి ఈ జాతీయ రహదారి ఉపయోగపడుతుందని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, కాంక్రిట్ వాల్ జనవరి నాటికి పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో సేఫ్టీ నియమాలు పాటించాలని కలెక్టర్ అన్నారు.
ఆర్.ఓ.బి. నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని, ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగపడుతుందని తెలిపారు.
నూతన సంవత్సరంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్ఓబీ నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.
రహదారి వాహనాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ సర్వీస్ రోడ్లు, మున్నేరు బ్రిడ్జ్ తో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని, జాతీయ రహదారి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణ పనులు నిరంతరం మానిటరింగ్ చేస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
కలెక్టర్ వెంట నేషనల్ హైవే పిడి దివ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మీ డబ్బు, మీ హక్కుపై ఈ నెల 20న జిల్లాలో శిబిరం...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం డిసెంబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం




సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, డిసెంబర్ -17
కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా "మీ డబ్బు, మీ హక్కు" అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన కార్యక్రమం డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, భీమా, తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో ఎంసీఏ, ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, బ్యాంకులు ఉమ్మడి శిబిరాలను నిర్వహిస్తాయని, ఇందులో భాగంగా ఈ నెల 20 న (శనివారం) ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఉమ్మడి శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.
బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ ( హ్ట్ట్జూం://బఎస్త్వుఎ.తీఎఱ.శీతీస్త్ర.అఅ ) ద్వారా పొందవచ్చని, క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు ఉమ్మడి శిబిరంలో బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిబిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ం

## చింతకాని నూతన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ని సన్మానించిన డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. ఈనెల 11వ తారీకు జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అఖండ భారీ మెజార్టీతో గెలుపొందిన కిలారుమనోహర్ బాబును...
నాగులవంచ గ్రామంలో వంకాయలపాటి రామయ్య కళ్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కిలారు మనోహర్ బాబును అభినందిస్తూ నేను మీకు.తోడుగా ఉంటానని భరోసానిస్తూ సగౌరవంగా శాలువాతో సన్మానించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ కార్యక్రమంలో చింతకాని సర్పంచ్ ఎన్నికలు గెలిచిన వార్డు మెంబర్లు మరియు ఉపసర్పంచ్ కోలా ఉమారాణి హాజరు కావడం జరిగింది కార్యక్రమం లో తదితరులు పాల్గొన్నారు

## చింతకాని మండలం మరియు ముదిగొండ మండలం లో గెలిచిన నూతన సర్పంచులను సన్మానించిన ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. తెలంగాణలో జరిగిన మొదటి విడత పంచాయతీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన అభ్యర్థులను (సర్పంచ్ లను) తెలంగాణ ఉప ముఖ్యమంత్రి ఆర్థిక% డ% విద్యుత్, ప్రణాళిక,శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క చింతకాని, ముదిగొండ మండలాల్లోని గెలుపొందిన సర్పంచ్ లను నాగులవంచ గ్రామంలోని వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్ నందు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు . దానిలో భాగంగా జగన్నాధపురం గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్నను, వైస్ సర్పంచ్ అలవాల శ్రీదేవిని, వార్డ్ సభ్యులను సన్మానించారు..
ఈ కార్యక్రమంలో.. మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

## మేము పార్టీ కోసమే పని చేసినం ...

- మమ్మల్ని సస్పెండ్ చేసే హక్కు సంజీవరెడ్డి కి లేదు...
- మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు పాషా...



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. 11 వ తేదీన జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకే నడుచుకున్నాను అంటున్న ముస్లిం మైనార్టీ చింతకాని మండల అధ్యక్షులు పాషా మంగళవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు.
వందనం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడ్డ అభ్యర్థి తరపున పని చేశాను తప్ప పార్టీకి ఎలాంటి నష్టం కలిగే విషయాలు నేను చేయలేదని తెలిపారు. పోటీ చేయొలని ఆలోచనతో నామినేషన్ దాఖలు చేసి అధిష్టానం ఆదేశం మేరకు నామినేషన్ విత్ డ్రా చేసుకున్నాను. అప్పటినుండి కాంగ్రెస్ పార్టిపార్టీ తరపున నిలబడ్డ వ్యక్తికే సపోర్ట్ చేసి ఆయన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు షేక్ మోయిన్, కోరిపల్లి పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో పరిశ్రమల విస్తరణకు వేగవంతమైన చర్యలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రఘునాథపాలెం మండలం పరిధిలో టిజిఐఐసి కి కేటాయించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, డిసెంబర్- 17** :జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

మంగళవారం రఘునాథపాలెం మండలం జింకల తండా, పువ్వాడ నగర్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టిజిఐఐసి) కు కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరిశ్రమలు నెలకొల్పడానికి స్థలం అనుకూలమైన పరిస్థితులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కేటాయించిన భూమి యొక్క విస్తీర్ణం, సరిహద్దులు, రహదారి అనుసంధానం, మౌళిక సదుపాయాల లభ్యతను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ప్రస్తుతం ఉన్న మొత్తం స్థలంను సేత్వార్, కాస్రా, నక్షా మ్యాప్ లను ఆధారంగా సమగ్రంగా సర్వే చేసి సరిహద్దులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

ఖమ్మం జిల్లాను పరిశ్రమలకు అనుకూల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నదని, టిజిఐఐసి ద్వారా కేటాయించిన భూములను సమర్థవంతంగా వినియోగించి ఆర్థిక అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ సాయినాథ్, పరిశ్రమల శాఖ జీఎం సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యం... అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- రేషన్ షాపులలో బియ్యం లభ్యతపై పత్రిక ప్రకటన విడుదల చేసిన అదనపు కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి(ఖమ్మం, డిసెంబర్ -17**

డిసెంబర్ 18 నుంచి 22 వరకు రేషన్ షాపులలో బియ్యం లభ్యత ఉంటుందని, లబ్ధిదారులు బియ్యం పొందాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోర్టబిలిటీ బియ్యం సంబంధించి ఖమ్మం జిల్లాకు 446.282 మెట్రిక్ టన్నులు కేటాయించడం జరిగిందని, ఈ బియ్యాన్ని చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసామని, రేషన్ లబ్ధిదారులు డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 22 వరకు వారికి సమీపంలో గల చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) నుంచి పోర్టబులిటి ద్వారా బియ్యం పొందాలని అన్నారు. ఇట్టి విషయంలో లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వెంకటాపురం సర్పంచిని సన్మానించిన సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు.





**సి కె న్యూస్ వలిగొండ బాలరాజు డిసెంబర్ 16 :**

వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన కర్ణకంటి కలమ్మ యాదయ్య ని సన్మానించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందడి సత్తి రెడ్డి మండల కమిటీ సభ్యులు కవిడే సురేష్ రాబోతు వెంకుల పాల్గొన్నారు

## ఎమ్మెల్యే ని కలిసిన కంచనపల్లి గ్రామ సర్పంచ్ వార్డ్ నెంబర్లు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు డిసెంబర్ 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని కంచనపల్లి గ్రామ సర్పంచి వార్డు నెంబర్లు వలిగొండలోని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని, గ్రామ సర్పంచి రేసు బుచ్చిరెడ్డితో వార్డు నెంబర్ల ఎమ్మెల్యేని కలిసినారు ఎమ్మెల్యే కంచనపల్లి గ్రామ సర్పంచికి వార్డు నెంబర్లకు శుభాకాంక్షలు తెలిపినారు.

## ఎల్ హెచ్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్‌గా భద్రాచలానికి చెందిన చంద్రకాంత్ ఎన్నిక.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 16,**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కార్యాలయం లో లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ హెచ్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించ బడింది. ఈ సమావేశంలో భాగంగా ఎల్ హెచ్ఎఫ్ఐ నూతన రాష్ట్ర కన్వీనర్‌గా భద్రాచలానికి చెందిన చంద్రకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా ఎల్ హెచ్ఎఫ్ఐ పేరెంట్ సంస్థ అయిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కార్యదర్శి కె. పార్థసారథి మాట్లాడుతూ, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గత రెండు దశాబ్దాలుగా లా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన న్యాయ విద్య అభివృద్ధి మరియు రాజ్యాంగ విలువల కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. లా విద్యార్థులు ఎదుర్కొనే ఏ సమస్య అయినా యూనియన్ వెంటనే స్పందిస్తూ పూర్తి అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

అలాగే భద్రాచలానికి చెందిన చంద్రకాంత్ ఇప్పటి వరకు అనేక సందర్భాల్లో లా విద్యార్థుల సమస్యల పై పోరాటాలు నిర్వహించడమే కాకుండా, వివిధ సెమినార్లు, సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉద్యమాత్మక పాత్ర పోషించారని కొనియాడారు. భవిష్యత్తు లో కూడా మరింత ఉత్సాహంతో పనిచేస్తూ లా విద్యార్థులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కన్వీనర్ చంద్రకాంత్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులందరి కీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. లా విద్యార్థుల సమస్యల పరిష్కారం, సంఘటిత పోరాటాలు మరియు ఎల్ హెచ్ఎఫ్ఐ సంస్థ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సహ-కన్వీనర్లు అలీ హైదర్, క్రాంతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మధ్య గేటు వద్ద ఆర్వోబికి గ్రీన్ సిగ్నల్

- భూ సేకరణ కోసం వేచి వేచి చూస్తున్న
- రాష్ట్ర ప్రభుత్వం వెంటపడుతున్నా
- రాగానే పనులు మొదలు పెడతాం
- ఎంపీ వద్దిరాజు వినతికి రైల్వే అధికారుల స్పందన



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఖమ్మం నగరంలో రెండు ప్రధాన వ్యాపార కూడళ్లు గాంధీ చౌక్, కమాన్ బజార్లను కలిపే మధ్యగేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబి) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే అందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి, తమ అప్పగిస్తే అక్కడ పనులు మొదలు పెడతామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ స్పష్టం చేశారు.

ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల కోరిక మేరకు మధ్య గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోరుతూ.. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రైల్వే జీఎం కు గత నెలలో ఓ వినతిపత్రం అందజేశారు. ఆ మేరకు రైల్వే జీఎం స్పందించి ఆయకు ప్రత్యుత్తరం రాశారు. ఖమ్మం - పందిళ్ళపల్లి మధ్యలో 104 లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీని పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఆర్వోబి
నిర్మాణం భూ సేకరణ అంశంతో ముడిపడి ఉన్నందున, అందుకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రైల్వే జీఎం తెలియజేశారు. ఈ అంశం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెడతామని దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ తన లేఖలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు స్పష్టం చేశారు.

## గ్రామపంచాయతీ పాలక వర్గాల సభ్యులతో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక మరియు విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు పట్టి విక్రమార్క.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని, ముదిగొండ మండలాల్లో నూతనంగా గెలుపొందిన గ్రామ పంచాయితీ పాలకవర్గాల సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మరియు విద్యుత్ శాఖ మంత్రి గౌరవనీయ శ్రీ భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.





ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సర్పంచుల వెన్నంటే ఉంటానని, గ్రామాల అభివృద్ధి ప్రణాళికల్లో వారితో కలిసి భాగస్వామ్యం అవుతానని పేర్కొన్నారు. సర్పంచులు పరిమిత వనరులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించి, గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి సర్పంచ్ రాగద్వేషాలకు అతీతంగా, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మధిర నియోజకవర్గ అభివృద్ధికి తనదైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు భట్టి విక్రమార్క గుర్తుచేశారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతోపాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ సారించాలని సూచించారు. ప్రతి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో సక్రియంగా పాల్గొనాల్సిందిగా సూచించారు.

ప్రతి సర్పంచ్ గ్రామ ప్రజలతో ఏకీభావంగా, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని, అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే ప్రజా ప్రభుత్వ అసలైన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మూడవ విడత గ్రామ పంచాయతీ పోలింగ్ కు అన్ని ఏర్పాటు పూర్తి
- నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలి
- ఉదయం 7 గంటల నుండి ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు
- సింగరేణి మండలం కారేపల్లి జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, డిసెంబర్ -17** :మూడవ విడత గ్రామాల్లో పోలింగ్ ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లాలో డిసెంబర్ 17న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా సింగరేణి మండలం కారేపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించారు. కేంద్రంలో ఆర్.వో. లు, పోలింగ్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి చెక్ లిస్టు ఆధారంగా అందినదా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల సిబ్బంది తమ విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఎక్కడ ఎటువంటి వివాదాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని అన్నారు. డిసెంబర్ 17 బుధవారం మూడవ విడతలో జిల్లా నందు ఏడు మండలాలు సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, సింగరేణి, ఏన్కూర్ పరిధిలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు.

పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి, ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

ఎన్నికల సిబ్బంది పోలింగ్ సరళిని, బ్యాలెంట్ పేపర్ ను బ్యాలెట్ బాక్స్ లో ఓటర్ల వేసే విధానాన్ని ఖచ్చితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని, ఎక్కడ తొందరపాటు లేకుండా ఆర్ఓ పూర్తి భాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరా ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

గ్రామ పంచాయతీ పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామ్యం ద్వారా లభించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్క ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కలెక్టర్ అన్నారు.

పోలింగ్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీసిఈవో దీక్షారైనా, మండల ప్రత్యేక అధికారులు రాజేశ్వరి, చందన్ కుమార్, సింగరేణి మండల తహసీల్దార్ రమేష్, యంపిడివో శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హైవే నిర్మాణ పనుల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అభివృద్ధి పనుల భూ సేకరణ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలి
- జిల్లాలో పురోగతిలో ఉన్న జాతీయ రహదారుల భూ సేకరణ స్థితిగతులు, నిర్మాణ పనులుపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, డిసెంబర్-17:**జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తవడానికి మిగులు భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో భూసేకరణ ప్రక్రియ, నేషనల్ హైవే నిర్మాణ పురోగతి పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కురవి సెక్షన్, నాగపూర్-అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మిగులు భూముల భూసేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు.

మేజర్ బ్రిడ్జిలు, వియుపి లు, ఆర్ఓబి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

నాగపూర్-అమరావతి ప్యాకేజి-1 మరియు 2 భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పరిహార చెల్లింపులు పూర్తిచేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, ఎన్ హెచ్ఏఐ పిడి రామాంజనేయ రెడ్డి, ఇఇ యుగంధర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు రండి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆహ్వానించిన భద్రాచలం ఆలయ ఈవో



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 16,**జనవరి 29, 30 తేదీల్లో భద్రాచలంలో జరగనున్న ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కు మంగళవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి దామోదర్ రావు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కోర్టులోని ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో ఆలయ ఈఓ దామోదర్ రావు, న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను సన్మానించారు.

అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ముక్కోటి ఏకాదశి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

భక్తులకు తాగునీరు, వసతి, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తులు మెచ్చేలా ఘనంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

## పెండింగ్ వేతనాలు ఇప్పించండి డిప్యూటీ సిఎం కు పంచాయతీ సిబ్బంది వినతి పత్రం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**పెండింగ్ వేతనాలు ఇప్పించండి.. డిప్యూటీ సిఎం కు గ్రామ పంచాయతీ కార్మికుల వినతి.. గత 3 నెలల వేతనాలు రాక మండలంలోని గ్రామ పంచాయతీ 8 (జగన్నాథపురం,కోదుమూరు, లచ్చగూడెం,మత్కేపల్లి, నాగులవంచ,పందిళ్ళపల్లి, వందనం,రామకృష్ణాపురం) గ్రామ పంచాయతీల సిబ్బంది తీవ్ర ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంటున్నారని,మండలం లో కేవలం ఈ 8 గ్రామ పంచాయతీల సిబ్బందికి జూలై, ఆగస్టు మరియు అక్టోబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదని,వేతనాలు వచ్చేలా చొరవ చూపాలని విన్నవించడం జరిగింది... ఇందుకు స్పందిస్తూ రాష్ట్రం మొత్తం మీద ఎక్కడ పంచాయతీ వర్కర్స్ వేతనాలు ఆగలేదని,సమస్య ఎక్కడ వుందో విచారించి వేతనాలు వచ్చేలా చూస్తానని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పంచాయతీ కార్మికులకు హామీ ఇవ్వడం జరిగింది..ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కు గ్రామ పంచాయతీ సిబ్బంది ధన్యవాదములు తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది దేశబోయిన కొండలు,కంభం పద్మ,భహాటం ఫణిరాజు (జిల్లా కమిటీ సభ్యులు), షేక్ బాషా సాహెబ్, కందిమళ్ళ బుచ్చిబాబు,మంద రాజ్కుమార్,తురక వెంకటేశ్వర్లు, పడిశాల.గోపి,పడిశాల యశోద, ఓర్సు.పుష్ప పాల్గొన్నారు...

## రేపల్లెవాడ గ్రామం పంచాయతీ ఏకగ్రీవం ఎన్నికైన మడిపల్లి అంబికాను ఘనంగా సన్మానించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** :నాగులవంచ గ్రామంలో వివిసి కళ్యాణ మండపంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క చేతుల మీదుగా చింతకాని మండలంలో రేపల్లె వాడ గ్రామపంచాయతీ ఏకగ్రీవ ఎన్నికైన గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబికాను శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ మడిపల్లి భాస్కర్ మడిపల్లి రాంప్రసాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సీతంపేటగ్రామం పంచాయతీ ఎన్నికైన ఆళ్ల మణెమ్మ ఘనంగా సన్మానించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** :నాగులవంచ గ్రామంలో వివిసి కళ్యాణ మండపంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క చేతుల మీదుగా చింతకాని మండలంలో సీతంపేట గ్రామపంచాయతీ ఎన్నికైన గ్రామ సర్పంచ్ ఆళ్ల మణెమ్మ శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో చింతకాని మండల నాయకులు. మధిర మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు మత్కేపల్లి నూతన మార్కెట్ . చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు సీతంపేట నాయకులు కొత్తపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు

## పొద్దుటూరు గ్రామపంచాయతీ నూతనగా ఎన్నికైన సర్పంచ్ మొగిలి కృష్ణయ్యను ఘనంగా సన్మానించిన డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఈ నెల 11వ తారీఖున జరిగిన సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచులకు నాగులువంచ గ్రామంలోని వంకాయలపాటి రామయ్య కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రొద్దుటూరు గ్రామం నుంచి అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించి నూతన సర్పంచిగా ఎన్నికైన శ్రీ మొగిలి కృష్ణయ్య ని ఆప్యాయంగా పలకరించి మీకు నేను తోడు ఉన్నానని సగౌరవంగా శాలువాతో ఘనంగా సన్మానించిన తెలంగాణ డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్క ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ పెంట్యాల పుల్లయ్య మరియు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి.

- రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 16,**జిల్లాలో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు, అల్లపల్లి, గుండాల, టేకులపల్లి మండలా ల్లో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని ఏడు మండలాల్లో మొత్తం 155 గ్రామ పంచాయతీలు, 1,330 వార్డులు ఉన్నాయని తెలిపారు. 155 గ్రామపంచాయతీలకు గాను రెండు గ్రామపంచాయతీలలో నామినేషన్లు దాఖలు కాలేదని, 8 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని, మిగిలిన 145 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే 1,330 వార్డులకు గాను మూడు వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదని, 256 వార్డులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 1,071 వార్డులలో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు గాను అవసరమైన సిబ్బంది సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు.


రేపు జరిగే పోలింగ్ సందర్భంగా అన్ని ఎన్నికల సిబ్బంది ఉదయం 7 గంటల కంటే ముందుగానే పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరును నిశితంగా పరిశీలించి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులను సిబ్బంది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అనవసరమైన ఇతర సామాగ్రి ఏదీ ఉండకుండా కట్టుదిట్టమైన నియంత్రణ పాటించాలని ఆదేశించారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు పూర్తయిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు.కౌంటింగ్ పూర్తైన అనంతరం బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు తదితర ఎన్నికల సామాగ్రిని పూర్తిగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, అవకతవకలు లేదా పొరపాట్లు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ నివేదికలను సమయానుసారం ఎటువంటి అంతరాయం లేకుండా టి%-%పోల్ యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరిగే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు కట్టుబడి, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా మరియు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక మరియు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు చెప్పారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొబైల్ పట్రోలింగ్, చెక్ పోస్టుల ఏర్పాటు ద్వారా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తామని వెల్లడించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సింగరేణి సీఎండీగా డి.కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ...





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 16,**సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో సింగరేణికి సీఎండీ (ఎఫ్ఏసీ)గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం ఆయన సింగరేణి భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుత ఛైర్మన్ ఎన్. బలరామ్ నుండి బాధ్యతలను తీసుకున్నారు. ఆయనకు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు.

డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులస్పెషల్ సెక్రటరీగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక శాఖకు స్పెషల్ సెక్రటరీ గానూ వ్యవహరించారు.

## పరివర్తన యశోద సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), డిసెంబర్ 16,** స్థానిక పరివర్తన యశోద సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేసారు స్థానిక రేవడి ఆనంద్ . అర్చన దంపతుల కుమారుడు కెవిన్ షాలోన్ పుట్టినరోజు సందర్భంగా దాదాపు 30 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యశోద ఫౌండేషన్ అధ్యక్షులు కోమగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికలాంగులకు మా సేవా సంస్థ తరపున వివిధ ప్రజాసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఎవరైనా దాతలు ఉంటే మా సంస్థకు తెలియజేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవిడి ఆనంద్ మాట్లాడుతూ వృద్ధులకు వికలాంగులకు సేవ చేయటంలో ఆనందం ఉందన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణ శ్రీనివాస్. కొమ్మ గిరి వెంకటేశ్వరరావు. అప్పన్న దాసు. అప్పారావు. బర్లదుర్గ తదితరులు పాల్గొన్నారు

## జుక్కల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిట్లం సర్పంచ్ కు ఘనంగా సన్మానం



**సీ కే న్యూస్:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి గ్రామ పంచాయతీ కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం రెండో విడత ఎన్నికలో పిట్లం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ గా గెలుపొందారు. సందర్భంగా వారు జుక్కల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుమ్మరి శాలివాహన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. తరువాత బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు కుమ్మరి యాదగిరి కి జుక్కల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పరుస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం కృషి చేస్తానని ఏ సమస్య ఉన్న వెంటనే అక్కడికి చేరుకొని పరిష్కారం చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు, కుమ్మరి శాలివాహన సంఘము సభ్యులు పాల్గొన్నారు.

## బూచే తండా పంచాయతీలో చీరలు పంచుతున్నంగా పట్టుకున్న ఓటర్లు



**సీకే న్యూస్ వైరా నియోజకవర్గ ప్రతినిధి బాధావత్ హోథిరాం నాయక్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలం బోజ్జ తండ గ్రామపంచాయతీ లో ఎలక్షన్ల నిమిత్తం రాత్రి 10 గంటల సమయంలో ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తుండగా ఆ పంచాయతీ ఓటర్లు పట్టుకొని మీడియాకు సమాచారం ఇవ్వగా మరియు ఎలక్షన్ అధికారులకు సమాచారం ఇవ్వనైనది

# యాదగిరిగుట్టలో ఘనంగా ధనుర్మాస వేడుకలు

భక్తుల కొంగు బంగారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ధనుర్మాస వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుని కొలుస్తూ నెల రోజులపాటు నిర్వహించే పాశుర పఠనాలను ఆలయ అర్చకులు, పారాయణీకులు ప్రత్యేకంగా జరిపిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు శ్రీస్వామి వారి ఆలయ ముఖ మండపంపై ఉత్తర భాగంలోని హాల్‌లో గోదాదేవి అమ్మవారిని వేంచేపు చేసి తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతోపాటు మార్గళి నివేదన వంటి వేడుకలు జరుగనున్నాయి.

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయ నిత్య కైంకర్యాల సమయాల్లో మార్పులు చేశారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు వేకువజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు తిరువారాధన, 4.30 నుంచి 5 గంటల వరకు తిరుప్పావై సేవాకాలం జరిపిస్తారు. 5 నుంచి 6 గంటల వరకు నివేదన, చాత్మర, 6 నుంచి 7 గంటల వరకు నిజాభిషేకం, 7 నుంచి 7.45 గంటల వరకు సహస్రనామార్చన, ఉదయం 7.45 నుంచి స్వామివారి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా జనవరి 14న రాత్రి 7 గంటలకు గోదాదేవి కల్యాణం, 15న ఉదయం 11.30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తారు.

ఘనంగా లక్షపుష్పార్చన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా శాస్త్రోక్తంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. సోమవారం స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో అర్చక బృందం, వేద పం డితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మం డపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదిక పై తీర్చిదిద్దారు. అర్చక బృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో వివిధ రకాల పూలతో పాంచరాత్రగమశాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు లక్షపుష్పార్చన చేశారు. తెల్లవారు జామునే ఆలయం తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామి వారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషే కం జరిపారు. శ్రీస్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయస్వామివారికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం వేళలో శ్రీస్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు.



రాత్రి వేళలో శ్రీస్వామివారి తిరువారాధన చేపట్టి, స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉద యం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.20,88,907 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో వెంకట్రావు తెలిపారు.

# ప్రియాంక గాంధీతో పీకే మంతనాలు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. ఉండేది కేవలం శాశ్వత ప్రయోజనాలు మాత్రమే. ఈ నానుడిని నిజం చేస్తూ.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీతో భేటీ కావడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు కాంగ్రెస్ నాయకత్వంపై అసహనంతో సొంత కుంపటి పెట్టుకున్న పీకే, ఇప్పుడు మళ్లీ అదే పార్టీ గడప తొక్కడానికి ప్రధాన కారణం.. ఇటీవలి బీహార్ ఎన్నికల ఫలితాలే అని చెప్పొచ్చు. ఇటు కాంగ్రెస్, అటు జన్ సురాజ్.. రెండూ ఘోర పరాజయాన్ని చవిచూసిన వేళ, ఈ కలయిక భవిష్యత్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతోందా అనే ఆసక్తి నెలకొంది. పీకే %-% ప్రియాంకల భేటీకి కారణం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రశాంత్ కిశోర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి బీహార్ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. మొత్తం 238 స్థానాల్లో పోటీ చేస్తే, ఒక్క సీటు కూడా గెలవకపోగా.. ఏకంగా 236 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. "వ్యూహకర్తగా గెలిపించడం వేరు.. నాయకుడిగా గెలవడం వేరు" అనే సత్యాన్ని ఈ ఫలితాలు పీకేకి రుచి చూపించాయి. మరోవైపు కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతకంటే భిన్నంగా ఏమీ లేదు. మహాకూటమిలో భాగంగా 61 సీట్లలో పోటీ చేసిన హస్తం పార్టీ, కేవలం 6 సీట్లకే పరిమితమైంది. ఈ ఫలితాలు రెండు పార్టీల అస్తిత్వాన్నే ప్రశ్నించేలా మారాయి. ఈ నేపథ్యంలోనే, ఇద్దరు పరాజితులు కలిసి భవిష్యత్ ప్రయాణం సాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. నిజానికి ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ గూటికి చేరడం ఇది కొత్తేమీ కాదు. జేడీయూ నుంచి బయటకు వచ్చాక, ఆయన కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనం కోసం ఒక బృహత్తర ప్రణాళికను సోనియా గాంధీకి సమర్పించారు. గాంధీ కుటుంబం కాని వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పజెప్పడం దగ్గరి నుంచి, సంస్థాగత నిర్మాణం వరకు అనేక సంచలనాత్మక మార్పులను ఆయన సూచించారు. అయితే, సోనియా గాంధీ ఆ నివేదిక పరిశీలనకు ఒక కమిటీని వేసి, పీకేను ఆ కమిటీలో ఒక సభ్యుడిగా చేరమన్నారు. కానీ, నిర్ణయాధికారాలు లేని





కమిటీలో ఉండలేనని, తనకు ఫ్రీ హ్యాండ్ కావాలని పీకే పట్టుబట్టడంతో ఆ చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాతే ఆయన జన్ సురాజ్ యాత్రను ప్రారంభించారు. సోనియా గాంధీ హయాంలో విఫలమైన చర్చలు, ఇప్పుడు ప్రియాంక గాంధీ చొరవతో మళ్లీ చిగురించడం ఆసక్తికరం. ప్రస్తుతం కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత క్రియాశీలకంగా ఉన్నది ప్రియాంకే. ఆమెతో పీకే భేటీ అవ్వడం వెనుక రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సొంత పార్టీని నిర్మించి, క్యాడర్ ను తయారు చేసుకోవడం ఎంత కష్టమో పీకేకి బీహార్ ఎన్నికలు అర్థం చేయించాయి. ఇప్పటికే బలమైన ఓటు బ్యాంకు, చరిత్ర ఉన్న కాంగ్రెస్ లాంటి ప్లాట్ ఫామ్ పై తన వ్యూహాలను అమలు చేయడం సులువని ఆయన భావిస్తుండవచ్చు. వరుస ఓటములతో కునారిల్లుతున్న కాంగ్రెస్ కు, కేవలం సిద్ధాంతాలు మాత్రమే సరిపోవు.. గెలిచే వ్యూహం కావాలి. ఆ లోటును భర్తీ చేయగల సత్తా పీకేకి ఉందని అధిష్టానం నమ్ముతోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రశాంత్ కిశోర్ మళ్లీ కాంగ్రెస్ కోసం పనిచేసేందుకు కొన్ని తాజా ప్రతిపాదనలతో వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈసారి ఆయన పాత్ర కేవలం ఎన్నికల వ్యూహకర్త గా ఉంటుందా? లేక పార్టీలో చేరి కీలక పదవిని చేపడతారా? అన్నది తేలాల్సి ఉంది. జన్ సురాజ్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తారా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో, టికెట్ల కేటాయింపులో తనకు స్పష్టమైన పాత్ర కావాలని పీకే కోరుతున్నట్లు సమాచారం. మొత్తానికి, బీహార్ ఎన్నికల ఫలితాలు ప్రశాంత్ కిశోర్ కు వాస్తవికతను, కాంగ్రెస్ కు అనివార్యతను గుర్తుచేశాయి. ప్రశాంత్ కిశోర్ దగ్గర బ్లూ ప్రింట్ ఉంది, కాంగ్రెస్ దగ్గర బ్రాండ్ ఉంది. ఈ రెండూ కలిస్తేనే బీజేపీ వంటి బలమైన శక్తిని ఎదుర్కోగలమని ఇరువురూ గ్రహించినట్లు కనిపిస్తోంది. ప్రియాంక గాంధీతో జరిగిన ఈ భేటీ.. కేవలం చర్చలకే పరిమితమవుతుందా లేక కాంగ్రెస్ వార్ రూమ్ లో పీకే మళ్లీ చక్రం తిప్పుతారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్

క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు. ఈ వ్యాక్సిన్ %ఎ=చీూ% సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ %-% మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్%-%వీ' అనే పేరు ప్రతిపాదించారు. మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30%-%50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు. 2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10 కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు

కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా. ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.

## కామ్ గా కానిచ్చేస్తున్నారు...

జనసేన ఒకరకంగా సైలెన్స్ గా ఉంది. క్యాడర్ నుంచి నేతల వరకూ అందరూ నోటికి తాళం వేసుకున్నట్లే కనిపిస్తుంది. ఎవరు ఏమనుకున్నా ఇంతకు ముందు కనిపించిన జోష్ నేడు జనసేనలో కనిపించకపోవడం ప్రతి ఒక్కరూ పసిగట్టే ఉంటారు. ఎందుకంటే గత రెండేళ్ల నుంచి నామినేటెడ్ పదవుల విషయంలోనూ, నియోజకవర్గాల్లో తమను టీడీపీ నేతలు పట్టించుకోకపోవడం ఈ సైలెన్స్ కు ముఖ్యకారణమని చెప్పాలి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై ప్రత్యర్థులు చేసే విమర్శలకు కూడా ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. గతంలో సోషల్ మీడియాలోనూ, వివిధ వేదికల ద్వారా పవన్ కల్యాణ్ పై ఈగవాలినా స్పందించే వారు నేడు పెదవి విప్పడానికి సిద్ధపడటం లేదు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గమనించి ఉండవచ్చు. గమనించినా పట్టించుకోకపోయి ఉండవచ్చు. నిన్న కాక మొన్న కోనసీమ కొబ్బరి విషయంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు సీరియస్ గా స్పందించినా దానిని ఖండించడానికి మంత్రి నాదెండ్ల మనోహర్ మినహా మరొక నేత ముందుకు రాలేదు. అందులోనూ కోనసీమ నుంచి ఎవరూ ఖండించకపోవడం కూడా గమనించాల్సిన విషయం. ఇక సోషల్ మీడియాలోనూ పవన్ కు అనుకూలంగా పెద్దగా పోస్టులు కనిపించడం లేదు. గతంలో ఇరగబడి పోస్టులు పెట్టి తమ అభిమాన నేతపై మాట పడనివ్వకుండా చేసిన వారు సయితం ఇప్పుడు చేతులు కట్టుకుని కూర్చుని ఉండటం డేంజర్ సిగ్నల్స్ అని చెప్పాలి. 2024 ఎన్నికలకు ముందు.. తర్వాత జనసేనలో పరిస్థితులు మారిపోయాయి. పవన్ కల్యాణ్ తో పాటు ఇద్దరు మంత్రులను పక్కన పెడితే దాదాపు పద్దెనిమిది మంది శాసనసభ్యులున్నారు. ఇద్దరు ఎంపీలున్నారు. వారు కూడా నోరు మెదపడం లేదు. అలాగే కొందరు కరడు గట్టిన జనసేన క్యాడర్ గతంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా కనిపించేవారు. కానీ రెండేళ్ల నుంచి తమను పట్టించుకోకపోవడం, తమ గోడు వినేవారు పార్టీలో లేకపోవడంతో క్యాడర్ నుంచి లీడర్ల వరకూ ఒకరకమైన నైరాశ్యం అలుము కుంది. ఇప్పటికైనా ఈ సంకేతాలను పవన్ కల్యాణ్ గమనించి ఒకింత క్యాడర్ కు చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలి. అలాగే వారికి భరోసా ఇచ్చేలా వారితో సమావేశమవ్వాలి. లేకుంటే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయని జనసేన నేతలే ఆందోళన చెందుతున్నారు.

### ఢిల్లీ - ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఘోర ప్రమాదం..

## పొగమంచు కారణంగా బస్సులు ఢీకొని మంటలు,4 మంది మృతి

ఢిల్లీ%-%ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా ఒకదానికొకటి ఢీకొన్న నాలుగు బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులతో పాటు సమీపంలో ఉన్న కొన్ని ఇతర వాహనాలు కూడా మంటల్లో చిక్కుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా ఢిల్లీ%-%ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు ప్రమాద కారణాలపై విచారణ చేపట్టారు. దట్టమైన పొగమంచులో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## భద్రచలంలో పెరిగిన చలి తీవ్రత

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అతి తక్కువ స్థాయిలో నమోదు కావడంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. పిల్లలు పెద్దలు చలిమంటలకు స్వెట్టర్ లకు అతుక్కుపోతున్నారు . ఉదయం 9 గంటలు అవుతున్నా సూర్యుడు రాక మంచు దుప్పటి లో మిణుకు మిణుకు మంటూ గడుపుతున్నారు ప్రజానీకం. గత రెండు రోజులుగా భద్రాచలం పట్టణంలో మంచు తీవ్రస్థాయిలో పడుతూ,బ్రిడ్జి మీద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాహనాల లైట్లు వేసుకున్నా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. .బ్రిడ్జి చెక్ పోస్ట్ వద్ద పార్క్ వద్ద కరకట్ట ప్రాంతంలో రామాలయం పరిసర ప్రాంతాల్లో మంచు బాగా కురుస్తుండడంతో రామాలయ ప్రాంగణాలు కనిపించే పరిస్థితి లేదు. రామాలయ స్నానఘట్టాలు,గోదావరి మాతా విగ్రహం,అభయాంజనేయ స్వామి ఆలయం,కళ్యాణ కట్ట మంచు కప్పేసి గోదావరి నది కూడా ఉందా లేదా అన్నట్టు గా ఉంది. భద్రాచలం పట్టణం నాలుగు వైపులా మంచు కురుస్తూ కొంత ఆహ్లాదకరంగా ఉన్నా,మరోపక్క వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది. బ్రిడ్జి మీద వచ్చే పోయే వాహనాలు ఉదయం 8 గంటల వరకు లైట్లు వేసుకుని ప్రయాణం జాగ్రత్తగా చేయాల్సి వస్తుంది. రామాలయ ప్రాంగణాలు అన్ని మంచు కౌగిలిలో వుండిపోతున్నాయి.

## హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు

నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది. 'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకుఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచిఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్-19మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులుఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతులజీవులు ఉన్నాయి. త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడజీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

# నెలసరి సమయంలో విపరీతమైన నొప్పులు ఉండే మహిళలు..

## ఈ చిట్కాలను పాటిస్తే ఫలితం ఉంటుంది..!



నెలసరి సమయంలో మహిళలకు ఉండే నొప్పులు, వారు పడే బాధ వర్ణనాతీతం. కొందరు మహిళలకు హార్మోన్ల సమస్యలు ఉన్నా ఇలాగే జరుగుతుంది. అలాగే పీఎంఎస్ దశలో ఉన్నవారికి కూడా తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. నెలసరి సమయంలో వచ్చే నొప్పులు సహజమే అయినప్పటికీ కొందరికి ఈ నొప్పులు మరీ తీవ్రంగా ఉంటాయి. అవి వారిని తరచూ ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంటాయి. దీంతో చెప్పలేని నొప్పి, బాధ ఉంటాయి. ఈ క్రమంలో వారు ఏ పనిచేయకపోతుంటారు. అలాగే ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉంటాయి. దీనికి తోడు అలాంటి మహిళల్లో కొందరికి జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. జీర్ణ సమస్యలు వస్తాయి. ఇలా ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా 90 శాతం మంది మహిళలు ఏదో ఒక సమయంలో ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటుంటారని గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ నొప్పులకు గాను ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. పలు ఇంటి చిట్కాలను పాటిస్తుంటే ఈ సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు.

**కిస్మిస్‌లు, అరటి పండ్లు..**

నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పులు ఉండే వారు రాత్రి పూట నీటిలో గుప్పెడు కిస్మిస్‌లను, కొద్దిగా కుంకుమ పువ్వును వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే ఆ నీళ్లను తాగి అనంతరం అందులో నానిన ఆ పదార్థాలను తినాల్సి ఉంటుంది. ఇలా చేస్తుండడం వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ చిట్కాను రోజూ పాటిస్తుంటే నెలసరి సమయంలో వచ్చే నొప్పులను చాలా వరకు తగ్గించుకోవచ్చు. మహిళలకు ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణ సమస్యలు ఉండవు. ఈ చిట్కాను పాటించడం వల్ల ఒత్తిడి, ఆందోళన సైతం తగ్గుతాయి. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఇక మహిళలు నెలసరి సమయంలో అరటి పండ్లను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల అనేక సమస్యలను తగ్గించుకోవచ్చు. అరటి పండ్లలో ఉండే విటమిన్ బి6, పొటాషియం నొప్పులను తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే ఈ పండ్లను తినడం వల్ల గ్యాస్ తగ్గుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**దుంపలు..**

మహిళలు నెలసరి సమయంలో చిలగడదుంపలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. అలాగే ముల్లంగి, బీట్ రూట్ వంటి దుంపలను సైతం తినవచ్చు. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు, సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంతోపాటు రోగ నిరోధఖ శక్తి పెరిగేలా చేస్తాయి. శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల నెలసరి నొప్పులు తగ్గుతాయి. అలాగే ఈ దుంపల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గించి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటిల్లో ఉండే పాలిఫినాల్స్ రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక మహిళలు ఈ దుంపలను తింటుంటే ఫలితం ఉంటుంది. రుతు సమయంలో వచ్చే నొప్పులను తగ్గించుకోవచ్చు.

**చిరు ధాన్యాలు..**

మహిళలు చిరు ధాన్యాలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. కొర్రలు, అరికెలు, సామలు, ఊదలు, రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలను రోజూ తింటుండాలి. వీటిల్లో ఉండే ఫైబర్ అధిక బరువును తగ్గించడంతోపాటు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే ఈ ధాన్యాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల స్త్రీలకు రుతు సమయంలో ఉండే నొప్పులు తగ్గిపోతాయి. అలాగే హార్మోన్ల సమస్యలు తగ్గుతాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా మారుతారు, యాక్టివ్‌గా ఉంటారు. కనుక మహిళలు రోజూ చిరు ధాన్యాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. అలాగే మహిళలు రోజుకు ఒక టీస్పూన్ చొప్పున నెయ్యిని తింటుండాలి. దీని వల్ల కూడా నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. నెయ్యిని తినడం వల్ల చర్మం పగలకుండా సురక్షితంగా ఉంటుంది. ఇలా ఆయా ఆహారాలను తీసుకుంటుంటే మహిళలు తమకు నెలసరి సమయంలో వచ్చే నొప్పులను చాలా వరకు తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.



# వెల్లుల్లితో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో మీకు తెలుసా..?



మన ఇంట్లోని వంటిల్లే ఓ వైద్యశాల వంటిదే. ఇందులో ఎన్నో రకాల ఔషధాలు ఉంటాయని తెలిసినా.. కానీ వాటి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. మన ఆరోగ్యానికి మేలు చేసే ఔషధాల్లో వెల్లుల్లి సైతం ఒకటి. సాధారంగా వంటల్లో ఎక్కువగా రుచి కోసం వెల్లుల్లిని వాడుతుంటారు కానీ.. వీటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న గుండెజబ్బుల సమస్యను నియంత్రించడంలో సహాయపడే ఎన్నో ఔషధ గుణాలు వెల్లుల్లిలో ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పరిశోధనలు సైతం చెబుతున్నాయి. ముఖ్యంగా కొలెస్ట్రాల్, హైబీపీ వంటి గుండెజబ్బులకు కారణవ-ుయ్యే సమస్యలను నియంత్రించడంలో సమర్థవంతంగా ఉపయోగపడుతుంది.

వెల్లుల్లితో కలిగే ప్రయోజనాల గురించి ఆయుర్వేదమే కాకుండా వైద్యశాస్త్రం సైతం చెబుతున్నది. వెల్లుల్లిలో అనేక సమ్మేళనాలు, పోషకాలున్నాయి. వీటితో శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రోజు ఉదయం మూడు నాలుగు వెల్లుల్లి రెబ్బలని ఖాళీ కడుపుతో తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. వెల్లుల్లితో ఎలాంటి ప్రయోజనాలుంటాయో ఓసారి తెలుసుకుందాం..

**గుండెజబ్బుల ప్రమాదం తగ్గుతుంది**

గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, తీవ్రమైన గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడే అనేక ఔషధ గుణాలు వెల్లుల్లిలో ఉన్నాయని అధ్యయనాలు గుర్తించాయి. పలు అధ్యయనాల్లో రక్తపోటును తగ్గించడంలో వెల్లుల్లి ఓ ముఖ్యమైన ఔషధమని తేలింది. వెల్లుల్లి సారం 24 వారాల వ్యవధిలో రక్తపోటును తగ్గించడంలో మెడిసిన్స్ మాదిరిగానే ప్రభావవంతంగా ఉంటుందని తేల్చారు.

**కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది..**

ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రెబ్బల్ని తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండెజబ్బలకు ప్రధాన కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. వెల్లుల్లిని తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గి, రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. ప్రస్తుతం వెల్లుల్లి ఆరోగ్యకరమైన కొవ్వుపై ఏమైనా ప్రభావం చూపుతుందా? అనే విషయంపై అధ్యయనాలు స్పష్టత ఇవ్వలేకపోయాయి.

**రోగ నిరోధకశక్తి..**

వెల్లుల్లిని తీసుకుంటే రోగనిరోధకశక్తిని పెంచడంలో సహాయపడుతుందని నిపుణులు తెలిపారు. జలుబు, ఫ్లూ వంటి వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. దగ్గు, జ్వరం, జలుబును అరికడుతుంది. నిత్యం రెండు వెల్లుల్లి రెబ్బలను తింటే ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. చాలాకాలంగా ఉన్న నాసికా, గొంతు ఇన్ఫెక్షన్లను సైతం నివారిస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో మంచి ఫలితాలుంటాయి.

# గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ..

## ఎందులో ఎక్కువ పోషకాలు ఉంటాయి.. దేన్ని తాగితే మనకు మేలు జరుగుతుంది..?

ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ గ్రీన్ టీ తాగాలని వైద్యులు చెబుతుంటారు. అలాగే బ్లాక్ టీని కూడా తాగాలని సూచిస్తుంటారు. గ్రీన్ టీ, బ్లాక్ టీని వేర్వేరుగా తయారు చేస్తారు. వీటి తయారీకి ఉపయోగించే టీ ఆకులు కూడా వేరేగా ఉంటాయి. అయితే కొందరు గ్రీన్ టీని తాగమని చెబితే, కొందరు బ్లాక్ టీ మంచిదని అంటారు. మరి వాస్తవానికి ఈ రెండు టీలలో దేన్ని తాగాల్సి ఉంటుంది..? ఏ టీలో ఎక్కువ పోషకాలు ఉంటాయి..? ఏ టీని రోజూ తాగితే మనం ఆరోగ్యంగా ఉండవచ్చు..? అని చాలా మందికి సందేహాలు కలుగుతుంటాయి. వీటికి వైద్యులు సమాధానాలు చెబుతున్నారు. గ్రీన్ టీ, బ్లాక్ టీ రెండింటికి సంబంధించి తేయాకులను కూడా %ఋఎవశ్రీశ్రీఋ ౦ఱఅవఅంఱం% అనే మొక్క నుంచి సేకరిస్తారు. కానీ ఈ ఆకులను వేర్వేరుగా ప్రాసెస్ చేస్తారు. దీంతో గ్రీన్ టీ, సాధారణ టీ రెడీ అవుతాయి. గ్రీన్ టీ గా తయారు అయ్యే ఆకులు కాస్త తక్కువ ప్రాసెస్ చేయబడతాయి. సాధారణ టీ గా మారే ఆకులను ఎక్కువగా ప్రాసెస్ చేస్తారు. వీటిని పొడిగా మారుస్తారు. అనంతరం దీంతో బ్లాక్ టీ తయారు చేసుకోవాల్సి ఉంటుంది.

**తయారీ వేర్వేరు..**

Camellia sinensis ఆకులను ఉడికించగా తయారు అయ్యే ఆకులను గ్రీన్ టీ ఆకులుగా వ్యవహరిస్తారు. కానీ %ఋఎవశ్రీశ్రీఋ ౦ఱఅవఅ-౦ఱం% ఆకులను పొడి చేసి పులియ బెట్టడం ద్వారా సాధారణ టీ పొడిని తయారు చేస్తారు. కనుక గ్రీన్ టీ, సాధారణ టీ తయారీ వేరుగా ఉంటుంది. అయితే ఈ రెండు టీలు మనకు దాదాపుగా ఒకేలాంటి లాభాలను అందిస్తాయి. కానీ పోషకాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. ఈ రెండు టీలలోనూ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. గ్రీన్ టీలో కాటెకిన్స్ అని పిలవబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అలాగే బ్లాక్ టీలో థియా ఫ్లేవిన్స్, థియారుబిజిన్స్ అని పిలవబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి భిన్న రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. గ్రీన్ టీని సేవించడం వల్ల కెఫీన్ చాలా తక్కువగా లభిస్తుంది. కానీ బ్లాక్ టీలో కెఫీన్ అధికంగా ఉంటుంది. గ్రీన్ టీ కాస్త చేదుగా, వగరుగా ఉంటే, బ్లాక్ టీ పులిసిన రుచిని కలిగి ఉంటుంది.

**క్యాన్సర్లు రాకుండా..**

గ్రీన్ టీని సేవించడం వల్ల మనకు శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ముఖ్యంగా గ్రీన్ టీని తాగితే ఈజీసీజీ అనే సమ్మేళనం లభిస్తుంది. ఇది చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. మన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించి వాపులను తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల బ్రెస్ట్, ప్రోస్టేట్, కోలన్ వంటి క్యాన్సర్లు రాకుండా నివారించవచ్చు. ఇక బ్లాక్ టీలో టీ పొడి ప్రాసెసింగ్‌కు గురవుతుంది కనుక చాలా వరకు ఈజీసీజీ నశిస్తుంది. అయినప్పటికీ పలు ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఈజీసీజీ లాంటి లాభాలనే అందిస్తాయి. కానీ చాలా తక్కువ శక్తివంతమైనవి. కనుక క్యాన్సర్లకు అడ్డుకట్ట వేయడంలో బ్లాక్ టీ కన్నా గ్రీన్ టీ ఎంతో మెరుగ్గా పనిచేస్తుంది. ఇక ఈ రెండు టీలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**దేన్ని తాగాలి..?**

ఇక బ్లాక్ టీని సేవిస్తే శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఈ విషయంలో గ్రీన్ టీ కన్నా బ్లాక్ టీ ఎంతో మెరుగ్గా పనిచేస్తుంది. అయితే మనస్సు ప్రశాంతంగా మారాలంటే మాత్రం గ్రీన్ టీని సేవించాల్సి ఉంటుంది. ఇక అధిక బరువును తగ్గించడంలో బ్లాక్ టీ కన్నా గ్రీన్ టీ ఎంతో ఉత్తమంగా పనిచేస్తుంది. గ్రీన్ టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఈ రెండు టీలను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుంది. ఇవి ప్రీ బయోటిక్ ఆహారాలుగా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. అయితే ఆరోగ్యంగా ఉండేందుకు ఈ రెండు రకాల టీలలో దేన్ని తాగాలి.. అంటే.. రెండింటినీ తాగాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం బ్లాక్ టీని, సాయంత్రం గ్రీన్ టీని ఒక కప్పు మోతాదు చొప్పున తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. రెండు రకాల టీలను సేవించడం వల్ల అన్ని లాభాలను పొందవచ్చని అంటున్నారు.





తు మేరీ మెయిన్ తేరా ప్రమోషన్ కోసం పసుపు రంగు లెహంగాలో అనన్య పాండే స్టన్స్

# 2026 లో 1000 కోట్ల తెలుగు సినిమా?

1000 కోట్ల క్లబ్ అన్నది టాలీవుడ్ కి ఇప్పుడు కామన్ గా మారిన పదం. %-%బాహుబలి%-,-% ఆర్ ఆర్ ఆర్%-, -%పుష్ప%-, -%కల్కి 2898%-% లాంటి చిత్రాలు 1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో? ఇండియన్ బాక్సాఫీస్ వద్ద టాలీవుడ్ యావరేజ్ టార్గెట్ 2000 కోట్లగా మారింది. ఎస్ ఎస్ ఎంబీ 29 %-%వారణాసి%-%, బన్నీ 26వ చిత్రాలైతే? అంతకు మించే హైప్ తీసుకొ స్తున్నాయి. రెండు సినిమాల టార్గెట్ 3000 కోట్ల టార్గెట్ గా బరిలోకి దిగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఆ సంగతి పక్కన బెడితే? 2025 లో మాత్రం టాలీవుడ్ నుంచి 1000 కోట్ల వసూళ్ల సినిమా ఒకటీ లేదు.



**సంక్రాంతి తర్వాత అన్నీ చప్పగానే**

రామ్ చరణ్ నటించిన %-%గేమ్ ఛేంజర్%-% భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో రిలీజ్ అయినా? ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తర్వాత మరే చిత్రం కూడా ఆ రేంజ్ లో రిలీజ్ అవ్వలేదు. చాలా సినిమాలు రీజనల్ మార్కెట్ కే పరిమితమయ్యాయి. వీటిలో పెద్ద విజయం సాధించిన చిత్రమేది? అంటే %-%సంక్రాంతికి వస్తున్నాం%-% ఒకటి కనిపిస్తుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల వసూళ్లను సాధించింది. ఇదేమీ పాన్ ఇండియా రిలీజ్ కాదు. రీజనల్ మార్కెట్ కే పరిమితమైన చిత్రం. అయినా వెంకీ ఇమేజ్ అనీల్ మార్క్ ఎంటర్ టైనర్ కావడంతో? కనెక్ట్ అయింది.

**ప్రభాస్ రెండు సినిమాలతో:**

మరి 2026 లో టాలీవుడ్ నుంచి 1000 కోట్లు సాధించే సత్తా ఉన్న చిత్రాలేంటి? అంటే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న %-%పెద్ది%-%పై అంచనాలున్నాయి. మార్చిలో ఈ సినిమా పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. అంతకు ముం దే? డార్లింగ్ ప్రభాస్ నటిస్తోన్న %-%ది రాజాసాబ్%-% సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతుంది. మారుతి దర్శకత్వం వహిస్తోన్న సస్పెన్స్ కామెడీ థ్రిల్లర్ ఇది. ప్రభాస్ ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని పాన్ ఇండియాలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రచారం పనులు కూడా మొదలు పెట్టిన సంగతి తెలిసిందే.

**పెద్ది, పౌజీపై అంచనాలు:**

మరి ఈ సినిమా 1000 కోట్ల పోటీ బరిలో ఉందా? అంటే ఇప్పుడే చెప్పలేం. నార్త్ ఆడియన్స్ కు కంటెంట్ కనెక్ట్ అవ్వడాన్ని బట్టి ఉంటుంది. %-%పుష్ప%-%లా కనెక్ట్ అయిందంటే? మాత్రం వసూళ్లతో బాక్సాఫీస్ మోతెక్కడం ఖాయం. అదే ఏడాది ప్రభాస్ నటిస్తోన్న %-%పౌజీ%-% కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తో న్న చిత్రమిది. ఇదోక పీరియాడిక్ యాక్షన్ చిత్రం కావడంతో? ఇండియా వైడ్ అంచనాలైతే భారీగా ఉన్నాయి. %-%పెద్ది%-%ని మించిన అంచనాలు %-%పౌజీ%-%పై ఉన్నాయి.

**గత గణాంకాలు ఆధారంగా:**

యూనివర్శల్ కాన్సెప్ట్ కావడంతో? బజ్ నెలకొంది. భారీ వార్ కథలోనే ఓ బ్యూటీఫుల్ లవ్ స్టోరీని కూడా తీసుకు న్నాడు. %-%సీతారామం%-% లాంటి పాన్ ఇండియా సక్సెస్ కూడా హను ఖాతాలో ఉన్న నేపథ్యంలో అంచనాలు రెట్టింపు అవుతు న్నాయి. అయితే టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతోన్న ఏ పాన్ ఇండియా సినిమా అయినా? నార్త్ బెల్ట్ నుంచి కచ్చితంగా 200 కోట్లకు పైగా వసూళ్లను రాబడితే? 1000 కోట్ల క్లబ్ అన్నది సాధ్యమని గత సినిమా గణాంకాలు చెబుతున్నాయి.



ఎమరాల్డ్ గ్రీన్ లెహంగాలో పాలక్ తివారీ

# పూరి తర్వాత ఆ రికార్డు అనీల్ దే!

టాలీవుడ్ లో అత్యంత వేగంగా సినిమా చిత్రీకరణ పూర్తి చేసి రిలీజ్ చేసిన ఘనత ఎవరిది? అంటే అంతా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ పేరు చెబుతారు. ఆయన డిక్షనరీలో రెండు మూడు నెలల్లోనే షూటింగ్ పూర్తి చేసిన సినిమాలెన్నో ఉన్నాయి. సెట్స్ కు వెళ్లిన తర్వాత చకాచకా షూటింగ్ చుట్టేయడం అన్నది పూరి ప్రత్యేకత.ఆర్టిస్టుల టైమ్ ఎక్కువగా తీసుకోడు. సినిమాలో ఎంత మంది పెద్ద ఆర్టిస్టులున్నా? ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా డీల్ చేయగలడు.ఁఅమితాబ్ బచ్చన్ లాంటి లెజెండరీనే పెట్టుకుని సినిమా తీసాడంటే? పూరి ఎంతటి పని వంతుడో చెప్పాల్సిన పని లేదు. పూరి సినిమాల్లో పెద్దగా సెట్స్ కూడా ఉండవు. వీలైనంత వరకూ రోడ్లు, స్టూడియోల్లోనే షూటింగ్ చుట్టేస్తాడు. అవసరమైతే పాటలకు సెట్స్ వేస్తాడు తప్ప లేదంటే! ఆ ఖర్చు కూడా నిర్మాతకు ఉండదు. సినిమాకు పబ్లిసిటీ ఖర్చు కూడా పెద్దగా ఉండదు. అది నిర్మాతల ఇష్టం మేరకు వదిలేస్తారు. మరి ఇదే తరహాలో సినిమాలు చేసే మరో డైరెక్టర్ ఎవరు? అంటే హిట్ మెషిన్ అనీల్ రావిపూడి పేరు చెప్పొచ్చు. పూరి విధానంలోనే అనీల్ కూడా వేగంగా షూటింగ్ పూర్తి చేయగల దర్శకుడు. ప్రారంభోత్సవం అనంతరం పెద్దగా సమయం తీసుకోడు. సెట్స్ కి వెళ్లిన తర్వాత ఆర్టిస్టుల డేట్లను బట్టి షూటింగ్ చుట్టేస్తాడు. అదనంగా డేట్లు తీసుకుని నిర్మాతపై బారం వేయడు. కథకు అవసరమైతే ఎంతైనా ఖర్చు చేయిస్తాడు. అందులోనూ వీలైనంత తక్కువలోనే సీన్ పూర్తి చేసేలా చూస్తాడు. దీనికి సంబంధించిన అనీల్ రెండు రకాల ప్లాన్ లు ముందుగానే సిద్ధం చేసి పెట్టుకుంటాడు. షూటింగ్ పూర్తి చేసిన చిత్రాన్ని అంతే వేగంగాను రిలీజ్ చేయగల సమర్థుడు. 15 ఏళ్ల కెరీర్ లోనే ఎనిమిది సినిమాలు చేసాడు. వాటి రిలీజ్ విషయంలో ఎక్కడా జాప్యం జరగలేదు. సాధారణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో కొంత ఆలస్యం జరుగుతుంటుంది. అక్కడా కూడా అనీల్ ఎంతో తెలివిగా ప్లాన్చేసి ముందుకెళ్తాడు. తాను తీసిన కంటెంట్ ని జనాల్లోకి తీసుకెళ్లడంలోనూ అంతే సమర్థుడు. ప్రచారం పరంగా నిర్మాతకు కోట్ల రూపాయలు ఆదా చేయగల దర్శకుడు కూడా. సినిమా పూర్తి చేయడం ఓ ఎత్తైతే? ఆ ప్రోడక్ట్ ని జనాల్లోకి తీసుకెళ్లడానికి ప్రచారం పేరుతో కోట్లు ఖర్చు చేయిస్తారు. కానీ అనీల్ ఇక్కడ ఎంతో స్మార్ట్ గా ఆలోచిస్తాడు. ప్రచారం కోసం సినిమాలో నటీనటుల్నే తెలివిగా వినియోగించుకుంటాడు. ఈ విషయంలో సందర్భాన్ని బట్టి రకరకాల వ్యూహాలు వేస్తుంటాడు.



%-%మన శంవకర ప్రసాద్ గారు%-% విషయంలో ప్రచారమంటే దూరంగా ఉండే నయనతారనే ఒప్పించి పని చేయించాడు. ఆ సినిమా ప్రారంభానికి ముందే? ప్రీ లాంచ్ ప్రమోషన్ ఎలా చేసాడో? తెలిసిందే. చిరంజీవి, నయనతార లాంటి స్టార్లనే రంగంలోకి ది ప్రచారం చేయించాడు. ఇక రిలీజ్ సమయంలో అదే టీమ్ తో ప్రచారం ఏ రేంజ్ లో నిర్వహిస్తాడో చెప్పాల్సిన పనిలేదు.